సాక్షి అనకాపల్లి

శనివారం । 24 । మే । 2025



నేరచరితులపై ప్రత్యేక నిఘా

నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. 10లో



శ్రీవారి సన్నిధిలో పారాయణాలు

విశాఖ: రుషికొండలోని టీటీడీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో విష్ణు సహస్ర నామ, హను మాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.



ఘనంగా క్షీరాభిషేకం

విశాఖ నగరంలో వెలిసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

విమ్స్‌లో కోవిడ్ ప్రత్యేక వార్డు



వైద్య సిబ్బందితో కోవిడ్ వార్డు పరిశీలిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

ఆరిలోవ: నగరంలో కోవిడ్ కలకలం రేపుతుండటంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా, విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో శుక్రవారం 20 పడకలతో కూడిన ప్రత్యేక కోవిడ్ వార్డును సిద్ధం చేశారు.విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు వార్డును పరిశీలించి, పడకలు, ఆక్సిజన్ యంత్రాలను తనిఖీ చేశారు. కొత్త కోవిడ్ వేరియంట్‌లైన జేఎన్-1, ఎల్ఎఫ్7, ఎన్‌బీ 1.8 పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోవిడ్ పరీక్షల కోసం రాపిడ్ కిట్లు అందుబాటులో ఉన్నాయని, పాజిటివ్ వస్తే వెంటనే ఆర్టీపీసీఆర్ పరీక్షలకు పంపిస్తామని తెలిపారు. ప్రజలు భౌతిక దూరం పాటించాలని, సామూహిక కార్యక్రమాలలో పాల్గొనవద్దని, వృద్ధులు, గర్భిణులు ఇళ్లకే పరిమితం కావాలని ఆయన సూచించారు. మాస్కులు, శానిటైజర్లు వాడాలని కోరారు.

ఏజెన్సీకి సాయంత్రం బస్సులు రద్దు



డిపో మేనేజర్ ధీరజ్

నర్సీపట్నం: నర్సీపట్నం ఆర్టీసీ డిపో నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు సాయంత్రం వెళ్లే బస్సులను రద్దు చేశామని డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు. అల్లూరి జిల్లాకు సాయంత్రం 5 గంటలు దాటిన తరువాత వెళ్లే సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశామన్నారు. పోలీసుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మారుమూల గ్రామాలకు వెళ్లే నైట్ హాల్ట్ బస్సులతోపాటు విశాఖపట్నం నుంచి నర్సీపట్నం మీదుగా భద్రాచలం వెళ్లే ఆర్టీసీ నైట్ సర్వీసు రద్దు చేశామన్నారు. పరిస్థితులు చక్కబడిన తరువాత పోలీసుల ఆదేశాల మేరకు బస్సులను తిప్పుతామని మేనేజర్ తెలిపారు.

పీపీ కాండ్రేగులకు ఎస్పీ అభినందన



జిల్లా కోర్టు పీపీ జగదీశ్వరరావుకు ప్రశంసా పత్రం అందిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: వివిధ కేసుల్లో నేరస్తులకు సకాలంలో కోర్టు ద్వారా జీవిత శిక్ష పడినట్లుగా తమ వాదనలను వినిపించిన జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరావును ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం అభినందించారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది నేర చరిత్ర కలిగిన వ్యక్తులను సకాలంలో కోర్టులో హాజరు పరిచి, చార్జ్‌షీట్ దాఖలు చేయడంతో సమర్థంగా వాదనలు వినిపించగలిగామని, న్యాయమూర్తులు నిందితులకు తగిన శిక్ష విధించారని తెలిపారు.

ఇరవై సూత్రాల అమలుపై నేడు సమీక్ష

తుమ్మపాల: జిల్లాలో అమలవుతున్న వివిధ పథకాలు, ఇరవై సూత్రాల కార్యక్రమం అమలు తీరుపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చైర్మన్ లంక దినకర్ సమీక్షించనున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న ఉదయం 10.30 గంటలకు జిల్లాలో అమలవుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్, పీఎం గ్రామీణ సడక్ యోజన, వ్యవసాయం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, టిడ్కో గృహాలు, అమృత్ 1.0, 2.0, లాఖ్ పతి దీదీస్, విశ్వకర్మ, పీఎం స్వనిధి, గరీబ్ కల్యాణ్ అన్న యోజన, పీఎం సూర్యఘర్, కుసుమ్ పథకాల అమలు తీరును సంబంధిత అధికారులతో చైర్మన్ సమీక్షిస్తారని ఆమె తెలిపారు. గత ఐదేళ్లలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన, ఎరువుల సబ్సిడీ, జాతీయ గోకుల్ మిషన్-పాల ఉత్పాదకత, ప్రస్తుత స్థితిగతులపై సమావేశంలో చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. వీటితో పాటు జిల్లాలోని పర్యాటక అభివృద్ధి కార్యకలాపాలు, పారిశ్రామిక పార్కులు, మున్సిపాలిటీల పరిధిలోని మురికివాడల అభివృద్ధి, తాగునీటి సరఫరా అంశాలపై సమీక్ష జరగనుందని ఆమె తెలియజేశారు.

నిఘా నిద్రపోతుందా..!



- జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో కనిపించని సీసీ కెమెరాలు
- ప్రైవేట్ వ్యక్తులు, వ్యాపారులు ఏర్పాటు చేసిన కెమెరాలే దిక్కు
- ప్రభుత్వం ఏర్పాటు చేసినవి 258.. అందులో పనిచేసేవి సగమే
- నిఘా లేక పెరుగుతున్న నేరాలు



నేర పరిశోధనలో నేడు మూడో నేత్రం ప్రాధాన్యం పెరిగింది. కొత్త తరహా నేరాలను సైతం సీసీ కెమెరాల సాయంతో పోలీసులు ఇట్టే ఛేదిస్తున్నారు. దీంతో బాధితులకు త్వరగా ఊరట కలగడమే కాకుండా.. నిందితుల వెన్నులో వణుకు పుడుతుంది. క్రైం రేటు తగ్గుతుంది. కానీ ప్రభుత్వ యంత్రాంగం ఆ దిశగా పెద్దగా శ్రద్ధ పెట్టడం లేదు. సమావేశాల్లో కొత్త కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పడమే గానీ చేతల్లో కనిపించడం లేదు.

సాక్షి, అనకాపల్లి: ఒక కెమెరా వందమంది పోలీసులతో సమానమని చెప్పడమే గానీ వీటి నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. ఇటీవల జరిగిన డీఆర్సీ సమావేశంలో, పార్లమెంట్ సభ్యుడి అధ్యక్షతన జరిగిన దిశ సమావేశంలో జిల్లావ్యాప్తంగా 2 వేలకు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారు. రెండు నెలలు దాటినా ఎలాంటి పురోగతి లేదు. సీసీ కెమెరాల రూపంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా తగినన్ని ఏర్పాటు చేయకపోవడంతో జిల్లాలో నేరాల సంఖ్య అదుపులోకి రావడం లేదు. జిల్లా కేంద్రమైన అనకాపల్లి మినహా ప్రధాన పట్టణాల్లో సీసీ కెమెరాల నిఘా కరువైంది. అంతర్జాతీయ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్న పరవాడ-రాంబిల్లి-అచ్యుతాపురం సెజ్‌లో సీసీ కెమెరాలే ఏర్పాటు చేయలేదు. అక్కడ ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలే దిక్కు. సెజ్‌లో ప్రధాన కూడలిలో కూడా సీసీ కెమెరాలు లేకపోవడమే కాకుండా కొన్ని చోట్ల ఉన్న ప్రైవేట్ సీసీ కెమెరాలు పోలీస్ కంట్రోల్ రూం పర్యవేక్షణలో లేవు. జిల్లాలో 258 ప్రభుత్వ సీసీ కెమెరాలు మాత్రమే ఉన్నాయి. అందులో సగం మాత్రమే పనిచేస్తున్నాయి. పోలీసుల నిర్లక్ష్యం గుర్తించిన దొంగలు జాతీయ రహదారులను ఆనుకుని ఉన్న ఇళ్లలో యథేచ్ఛగా చోరీలు చేస్తున్నారు.

ప్రైవేట్ సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన

జిల్లాలో ప్రధాన పట్టణాలైన అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి, చోడవరంతో పాటు జాతీయ రహదారులను ఆనుకుని ఉన్న అడ్డురోడ్డు, నక్కపల్లి, జంక్షన్‌ల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. కాలనీలతో పాటు, అపార్ట్‌మెంట్లలో కూడా ఏర్పాటు చేసేలా అవగాహన కల్పించాలి. వాటిని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానించాలి. సీసీ కెమెరాలు ప్రారంభించిన సమయంలో కొద్ది రోజులపాటు బాగానే పనిచేశాయి. నేరాలను నియంత్రించగలిగారు. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు కెమెరాలను ఏర్పాటు చేసినప్పటికీ ప్రధాన రహదారుల్లో మాత్రమే కెమెరాలు పనిచేస్తున్నాయి. పలు కాలనీల్లోనూ పనిచేయడం లేదు. ప్రైవేట్ యాజమాన్యాల వారు సహకరించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరాలకు ప్రాథమిక స్థాయిలోనే అడ్డుకట్ట వేయడానికి అవకాశం ఉంటుంది. రెండేళ్ల క్రితం ప్రధాన పట్టణాల్లో ప్రైవేట్ యాజమాన్యాలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా పోలీసులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అవి కొనసాగితే నేరాలు తగ్గుముఖం పట్టేందుకు అవకాశం ఉంటుంది.



అనకాపల్లి టౌన్‌లో సీసీ కెమెరాలు లేని రామచంద్ర థియేటర్ జంక్షన్



సీసీ కెమెరాలు అరకొరగా ఉన్న కీలకమైన అచ్యుతాపురం జంక్షన్

వాహనాల వేగానికి ముకుతాడు

జిల్లా వ్యాప్తంగా 258 ప్రభుత్వ సీసీ కెమెరాలుండగా... వాటిలో ఏపీ క్లౌడ్ బేస్డ్ సీసీ కెమెరాలు 158, ఏఎన్‌పీఆర్ (ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్) కెమెరాలు 100 ఉన్నాయి. ఏఎన్‌పీఆర్ కెమెరాలను హైవేలలో ప్రధాన కూడళ్లలోనూ ...సిటీ ప్రధాన రహదారి కూడలిలో ఏర్పాటు చేశారు. ఇవి వాహనాల నెంబర్ ప్లేట్‌ని జూమ్ చేస్తుంటాయి. ఈ సీసీ కెమెరాల ద్వారా రోడ్డు ప్రమాదాల్లో తప్పించుకునే వాహనాలు, చోరీలను ఛేదించగలుగుతారు. వీటి వల్ల వాహనాల మితిమీరిన వేగానికి కళ్లెం పడుతుంది. వీటితోపాటు క్లౌడ్ బేస్డ్ సీసీ కెమెరాల సంఖ్యను పెంచాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ సీసీ కెమెరాలు దాదాపుగా 1500కి పైగా ఉన్నాయి.

మరిన్ని కెమెరాల ఏర్పాటుకు కృషి

సీసీ కెమెరాల ద్వారా అనేక నేరాలను ఛేదించాం. ఇటీవల కిడ్నాప్‌నకు గురైన చిన్నారి లోహితను కూడా సీసీ కెమెరాల సాయంతోనే పట్టుకొని తల్లి వద్దకు చేర్చాం. జిల్లాలో దాదాపుగా అన్ని సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. ఎక్కడైనా పనిచేయనివి ఉంటే వాటిని గుర్తిస్తాం. అంతేకాకుండా పట్టణాల్లో ప్రధాన వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలు, ప్రైవేట్ సంస్థల సమీపంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. అపార్ట్‌మెంట్లలో కూడా ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నాం. సీసీ కెమెరాల నిఘాతో నేరగాళ్లకు అడ్డుకట్ట వేస్తున్నాం. ఎవరూ చూడలేదు కదా అని నేరాలకు పాల్పడితే సీసీ కెమెరాల్లో బందీకాక తప్పదు. స్పీడ్ డ్రైవింగ్, చైన్‌స్నాచింగ్, హత్య కేసులు, ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడే వారిపై సీసీ కెమెరాలు ఎప్పుడూ నిఘా ఉంచుతాయి. పట్టణాల శివారు ప్రాంతాల్లో గల నిర్మానుష్య ప్రాంతాల్లో, ప్రైవేట్ ఆర్గనైజేషన్స్, షాపులు, ఇతర ప్రైవేట్‌సంస్థల వద్ద మరిన్ని కెమెరాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం.

– మోహన్‌రావు, అడిషనల్ ఎస్పీ (క్రైం)

భగ్గుమన్న దళిత సంఘాలు

- డొంకాడ దాడి కేసు నిందితులను అరెస్టు చేయకపోవడంపై ఆగ్రహం
- హోం మంత్రి నియోజకవర్గంలోనే దళితులకు రక్షణ లేదని ఆవేదన
- వందలాది మందితో జాతీయ రహదారిపై భారీ ర్యాలీ
- చర్యలు తీసుకోకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక



డొంకాడలో దళితులపై దాడి చేసిన టీడీపీ నాయకులను అరెస్టు చేయాలంటూ నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద దళిత సంఘాల ఆందోళన



ఎస్ఐని కలిసి సమస్య వివరిస్తున్న దళిత ప్రతినిధులు

నక్కపల్లి: ఆవేదన చెందారు.. ఆగ్రహించారు.. దళితులంటే అంత చులకనా అని నిలదీశారు.. ఈ రోజుల్లో కూడా ఇదెక్కడి దారుణమని ప్రశ్నించారు.. డొంకాడ ఘటనపై పలు ప్రజా, దళిత సంఘాలు నక్కపల్లిలో శుక్రవారం నిర్వహించిన నిరసన ప్రదర్శన ఉద్విగ్నంగా సాగింది. సాక్షాత్తూ దళితురాలైన హోం మంత్రి అనిత నియోజకవర్గంలోనే ఈ దారుణం జరగడం, ఆమె కనీసం బాధితుల పరామర్శకు రాకపోవడం వారిని కలచివేసింది. శుక్రవారం దళిత హక్కుల ఐక్యవేదిక, సీపీఎం, సీపీఐ వివిధ దళిత సంఘాల ఆధ్వర్యంలో వందలాది మంది దళితులు నక్కపల్లి జాతీయరహదారిపై భారీ ర్యాలీ, ఆందోళన చేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ చేసి సీఐ, ఎస్ఐలను కలిసి కేసు నమోదుపై వినతిపత్రాలు అందజేశారు. ఆందోళనకు నాసా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్, ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు సోనీవుడ్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు, విశ్రాంత ఆర్‌జేడీ జీవీ ప్రభాకర్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు నాయకత్వం వహించారు. వారు మాట్లాడుతూ.. వివాహ కార్యక్రమానికి లైటింగ్ పనుల కోసం వచ్చిన 8మంది దళిత యువకులపై సెల్‌ఫోన్ చోరీ అభియోగం మోపారని, కులం పేరుతో దూషించి కర్రలతో దాడి చేసారన్నారు. 18వ తేదీ రాత్రి పంచాయతీకి పిలిచి లైట్లు ఆర్పేసి తెల్లవార్లు యువకులను కర్రలతో కొడుతూ వేధించారన్నారు. పోలీసులు టీడీపీకి చెందిన అగ్రవర్ణాల వారికి కొమ్ముకాస్తూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కాకుండా, బెయిలబుల్ సెక్షన్లు నమోదు చేసి ఎఫ్ఐఆర్ రాశారని ఆరోపించారు.

పక్షపాత ధోరణిలో డీఎస్పీ విచారణ

డీఎస్పీ చేసిన విచారణ పక్షపాతంగా సాగిందని, బాధితులను సమగ్రంగా విచారించలేదన్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులంతా హోమ్ మంత్రి దగ్గరకు వెళ్తే తక్షణమే కేసులు నమోదు చేయించి అరెస్టు చేయించకపోగా గ్రామానికి వచ్చి ఇరువర్గాలతో చర్చలు జరిపి రాజీ కుదురుస్తానని చెప్పడం శోచనీయమన్నారు. అవసరమయితే నిరాహార దీక్షలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తికి వినతి పత్రం అందజేశారు.

దళితులకు రక్షణ లేదు



దాడి జరిగి వారం గడుస్తున్నా ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణం. మంత్రి నియోజకవర్గంలో దళితులకు రక్షణ లేదు. అగ్రవర్ణాల వారు దళితులపై దాడి చేశారు. పాయకరావుపేట ఎస్సీ నియోజకవర్గం అయినప్పటికీ ప్రతి విషయంలో బాధితులు మాత్రం దళితులే. దాడులు, అత్యాచారాలు దళితులపైనే జరుగుతున్నాయి. డొంకాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మళ్లీ దాడులు జరిగే అవకాశం ఉంది. తక్షణమే 14 మంది నిందితులను అరెస్టు చేయాలి.

– సోనీ వుడ్, నాసా సంస్థ డైరెక్టర్

దాడి చేయడం దారుణం



సెల్‌ఫోన్ దొంగిలిస్తే కేసు పెట్టి శిక్షించాలి. కానీ దుర్మార్గంగా కులం పేరుతో దూషిస్తూ కర్రలతో దాడి చేయడం దారుణం. ఫిర్యాదు చేస్తే బెయిలబుల్ సెక్షన్లతో కేసులు నమోదు చేయడం తగదు. దాడి చేసింది టీడీపీకి చెందిన వారు కావడంతో మంత్రి అనిత అగ్రవర్ణాల వారికి సపోర్టు చేస్తున్నారని భావిస్తున్నాం. నిందితులను అరెస్టు చేయించకుండా రాజీ చేస్తామని చెప్పడం శోచనీయం. డీఎస్పీ విచారణ పారదర్శకంగా లేదు. ముందు అరెస్టు.. తర్వాతే రాజీ చర్యలు.

– జి.వి.ప్రభాకర్, డీహెచ్‌పీఎస్ నేత

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు



ప్రవేశ దరఖాస్తుల విక్రయాన్ని ప్రారంభించిన ఆర్ఈసీఎస్ ఎండీ ప్రసాద్

కశింకోట: ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయంలో ఉన్న రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో 50 శాతం విద్యుత్ వినియోగదారుల విద్యార్థుల కోటా సీట్లలో ప్రవేశానికి దరఖాస్తు విక్రయాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆర్ఈసీఎస్ ఎండీ జి.ప్రసాద్ మాట్లాడుతూ సంస్థ పరిధిలోని కశింకోట, మునగపాక, అనకాపల్లి గ్రామీణం, సబ్బవరం, పరవాడ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారుల పిల్లల సర్టిఫికెట్లు పరిశీలన జరిపిన అనంతరం దరఖాస్తులను పూరించి కళాశాల కార్యాలయంలో సమర్పించాలన్నారు. కళాశాల పనిదినాల్లో దరఖాస్తులు పొందాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఫీజు రీయింబర్స్‌మెంటు పథకం వర్తింపు జరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉమాశంకర్, అసోసియేట్ ప్రిన్సిపాల్ కర్రి శివ, విభాగాధిపతి గణేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సింహగిరిపై ఒడిశా భక్తుల సందడి



వింజామరతో స్వామికి సేవలందిస్తున్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

అప్పన్నకు నిత్యకల్యాణం జరిపించిన దాసుడు

సింహాచలం: సింహగిరిపై నిత్యకల్యాణం ప్రాంగణం ఒడిశా భక్తులతో కిటకిటలాడింది. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి జరిపించిన నిత్యకల్యాణంలో పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. ముందుగా స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు విశేష పూలాలంకరణ చేసి వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష్మీకాంత్ నాయక్ దాస్ వింజామరతో స్వామికి సేవలందించారు. భక్తులకు స్వామి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నలుగురిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



పర్యాటకులను రక్షించిన లైఫ్‌గార్డ్స్

డాబాగార్డెన్స్: ఆర్కే బీచ్‌లో విషాదం తప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఎనిమిది మంది యువకులు సరదాగా గడిపేందుకు బీచ్‌కు వచ్చారు. వారిలో నలుగురు సముద్రంలో మునిగిపోతూ ఉండగా జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ వెంటనే స్పందించి కాపాడారు. జీవీఎంసీ ఇన్‌చార్జి స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు తెలిపిన వివరాలివి. హైదరాబాద్ నుంచి వచ్చిన షబ్బీర్, అబ్బాస్, విద్రస్, హుస్సేన్ అనే యువకులు శుక్రవారం ఉదయం ఆర్కే బీచ్‌లో స్నానానికి దిగారు. అయితే సముద్ర అలల ఉధృతికి వారు నీటిలో మునిగిపోవడం గమనించిన బీచ్ లైఫ్‌గార్డ్స్ ధనరాజు, నవీన్, ఆనంద్, లక్ష్మణరావు, కేపీ వాసు వెంటనే రంగంలోకి దిగారు. నలుగురు యువకులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అనంతరం వారికి ప్రథమ చికిత్స అందించారు. ఆ తర్వాత వారిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం వారిని పంపించివేశారు.

బదిలీలతో ఎంటీఎస్ టీచర్లు బలి

- ఖాళీల జాబితాలో వారు పనిచేస్తున్న స్కూళ్లు
- మళ్లీ ఏజెన్సీ బాట తప్పదని ఆందోళన
- భద్రత, కనీస అలవెన్సులకు నోచుకోని వైనం
- ఉమ్మడి విశాఖలో 620 మంది ఎంటీఎస్ టీచర్లు



కౌన్సెలింగ్‌లో ఎంటీఎస్ టీచర్లు

విశాఖ విద్య: దశాబ్దాల పోరాటంతో కొలువు దక్కించుకున్నామనే ఆనందం మినిమమ్ టైం స్కేల్(ఎంటీఎస్)తో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎన్నో రోజులు మిగల్లేదు. కొన్నాళ్లు ఏజెన్సీలో పని చేస్తే ఆ తర్వాత స్వగ్రామాలకు సమీపంలో పోస్టింగ్ ఇస్తామని చెబితే ఉద్యోగాల్లో చేరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యోగాలు ఇచ్చారనే ఏకైక కారణంతో కూటమి ప్రభుత్వం విషం కక్కుతోంది. టీచర్ల బదిలీలకు తెరలేపిన ప్రభుత్వం, ఎంటీఎస్ టీచర్లను గాల్లోపెట్టి, వారు పనిచేస్తున్న స్థానాలను ఖాళీలుగా చూపించారు. దీంతో మళ్లీ ఎక్కడికి పోవాలో తెలియక సతమతమవుతున్నారు.

న్యాయ చిక్కుల్ని పరిష్కరించి.. : న్యాయపరమైన సమస్యల్ని పరిష్కరించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో డీఎస్సీ-98 సెలక్టెడ్ అభ్యర్థులు 324 మంది, డీఎస్సీ-2008 అభ్యర్థులు 296 మందికి ఎంటీఎస్ ప్రాతిపదికన ఉద్యోగాలిచ్చారు. డీఎస్సీ-2008 వారికి మైదాన ప్రాంతంలోనే పోస్టింగ్‌లు ఇచ్చారు. డీఎస్సీ-98కి చెందిన 93 మందిని మైదాన ప్రాంతంలో, మిగిలిన 231 మందిని అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ మండలాలకు కేటాయించారు. 98 డీస్సీకి చెందిన వారిలో కొందరు ఇప్పటికే రిటైర్ కూడా అయ్యారు.

జీతం మినిమం.. పని మాగ్జిమం

రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా ఎంటీఎస్ ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు రూ.32,470లు వేతనం చెల్లిస్తున్నారు. దీంతో సొంత మండలాలు, లేదా సమీప మండలాల్లోని స్కూళ్లలోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని నాటి ప్రభుత్వం ఆదేశించింది. కానీ మైదాన ప్రాంతంలో అన్ని ఖాళీలు లేనందున చాలా మందిని ఏజెన్సీలో నియమించారు. దశల వారీగా వారిని మైదాన ప్రాంతానికి తీసుకురావాలని అప్పటి ప్రభుత్వం విద్యాశాఖాధికారులకు దిశా నిర్దేశం చేసింది.

ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలో..

డీఎస్సీ-98 ఎంటీఎస్ టీచర్లను 2023లో కౌన్సిలింగ్ ద్వారా స్కూళ్లు కేటాయించారు. 2024లో ఎక్కడి వారినక్కడే రెన్యువల్ చేశారు. ప్రస్తుతం టీచర్ల బదిలీల నేపథ్యంలో 620 ఎంటీఎస్ స్థానాలను ఖాళీలుగా చూపారు. దీంతో రెగ్యులర్ టీచర్లు కోరుకోగా మిగిలిన ఖాళీలు మాత్రమే వీరికి దక్కనున్నాయి. ఈ నేపథ్యంలో బదులు తెరిచాక.. ఎక్కడికి వెళ్లాల్సి వస్తుందో తెలియని అయోమయంలో ఎంటీఎస్ టీచర్లున్నారు.

పోస్టింగ్ ఎక్కడిస్తారో..



మా కుటుంబం ఉండేది విశాఖలోని ఎన్ఏడీ. ప్రస్తుతం అల్లూరి జిల్లాలోని డుంబ్రిగుడ మండలం పరిడి గిరిజన ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్నా. లా చదివినా, ఉపాధ్యాయ వృత్తిపై ఇష్టంతో ఇందులో చేరా. కానీ.. తీసుకొచ్చి ఏజెన్సీలో పడేశారు. ఈ ఏడాదైనా మా జిల్లాలో పోస్టింగ్ ఇస్తారని ఆశగా ఎదురు చూస్తున్నా.

– దాట్ల లక్ష్మీదేవి

రిటైరయ్యే ముందైనా..



మాది విశాఖ జిల్లా అగనంపూడి. ఆగస్టులో రిటైర్ అయిపోతా. ముంచంగిపుట్ మండలం కెందుగుడ మండల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నా. ఈ ఏడాది పోస్టింగ్ ఎక్కడిస్తారో కూడా తెలియట్లేదు. రెండు నెలల కోసం మళ్లీ మకాం మార్చాల్సిందేనా. కనీసం.. రిటైరయ్యే ముందైనా విశాఖ జిల్లాలో పనిచేసే అవకాశం ఇవ్వాలి.

– ఎం.అనిత

ఏడాదిలోపే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత

- ప్రజా సమస్యలపై నిలదీయండి
- ప్రభుత్వ నియంతృత్వ పోకడలపై పోరాటాలు
- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు హైమావతి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి, వేదికపై మాజీ ఎమ్మెల్యే గణేష్


సమావేశానికి హాజరైన వివిధ కమిటీల సభ్యులు, ప్రజాప్రతినిధులు

నర్సీపట్నం: ఏడాది కాక మునుపే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి విమర్శించారు. నర్సీపట్నంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అధ్యక్షతన శుక్రవారం పార్టీ నియోజకవర్గ మండల కమిటీల ముఖ్య నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించి, ప్రభుత్వ నియంతృత్వ పోకడలను ఎండగట్టాలన్నారు. గ్రామ, బూత్ కమిటీలతో 18 లక్షల మందితో జగనన్న సైన్యం తయారవుతుందన్నారు. ఈ సైన్యానికి ఐడీ కార్డులతో పాటు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ సైన్యంతో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఇకపై పార్టీ కార్యకర్తకు సముచిత స్థానం కల్పించేందుకు జగనన్న నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. మళ్లీ జగనన్నను సీఎం చేసేందుకు ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్నందున పార్టీ నాయకులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ నెలాఖరుకు పార్టీ అనుబంధ విభాగాల ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. మహిళా విభాగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వేధింపులకు గురైన వారి తరపున పోరాటంలో కార్యకర్తలు ముందుండాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వానికీ ఏడాదిలోపు ఇంత వ్యతిరేకత కనిపించలేదన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, ప్రతి మహిళకు రూ.18 వేలు ఇస్తామన్న హామీ గాలికివదిలేశారని ఆమె ధ్వజమెత్తారు.

కేసులకు భయపడం..

మాజీ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో పాలన చాలా దారుణంగా ఉందన్నారు. కేసులకు భయపడే ప్రసక్తిలేదన్నారు. రానున్న రోజుల్లో పార్టీ పిలుపు మేరకు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండకడతామన్నారు. జగనన్న కంటే సంక్షేమ పథకాలు ఇంకా బాగా ఇస్తారనే ఆశతో కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి ప్రజలు మోసపోయారని చెప్పారు. గ్రామ, బూత్ కమిటీల ఏర్పాటుకు పార్టీ నాయకులు కసరత్తు చేయాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ నర్సీపట్నంలో వేధింపుల పాలన కొనసాగుతుందన్నారు. పార్టీ నాయకుల ఇళ్లు కూలగొట్టించడం, మర్డర్, కిడ్నాప్ కేసులు పెట్టి పార్టీ నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పోలీసు, రెవెన్యూ వ్యవస్థలు అమ్ముడుపోయాయన్నారు. న్యాయ వ్యవస్థ బతికి ఉండడంతో కేసులను దీటుగా ఎదుర్కొంటున్నామన్నారు. సంక్షేమ పథకాలను అటకెక్కించి, విశాఖలోని విలువైన భూములను దోచుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, జిల్లా మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, ఎంపీపీలు గజ్జలపు మణికుమారి, రుత్తల సర్వేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు శానపతి వెంకటరత్నం, నాగేశ్వరరావు, చిటికెల రమణ, వివిధ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేరచరితులపై ప్రత్యేక నిఘా పెట్టండి


జిల్లా నేరాల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

సమీక్ష సమావేశంలో ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై ఆయా ప్రాంతాల పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని, పాత కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను పట్టుకుని కోర్టులో హాజరుపర్చాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా నెలవారీ నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండిగ్ కేసులు, ఎన్‌డీపీఎస్ కేసులు, దొంగతనాలు, చైన్ స్నాచింగ్, రోడ్డు ప్రమాదాలు, సాధారణ మరణాలు, ఇతర కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేసుల దర్యాప్తు పురోగతిపై అధికారుల నుంచి సమగ్ర సమాచారం తీసుకొని, కేసుల ఛేదన త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. న్యాయస్థానాల్లో నేరస్తులకు శిక్ష పడేలా పటిష్ట ఆధారాలతో కేసులను ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. రాత్రి సమయంలో గస్తీలను ముమ్మరం చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ విస్తృతం చేయాలని, రాత్రి సమయంలో రహదారులపై తిరుగుతున్న వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. డయల్ 112కు వచ్చే కాల్స్‌కు త్వరగా స్పందించి, శిక్షణతో కూడిన టీమ్‌లు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు భరోసా కల్పించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా పాల్పడుతున్న స్మగ్లర్ల ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారిని డీ-అడిక్షన్ సెంటర్లలో చేర్పించేలా కుటుంబ సభ్యులను చైతన్యపరచాలన్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో యాక్ట్, మహిళా చట్టాలు, సైబర్ నేరాలపై విద్యార్థులలో అవగాహన కల్పించాలన్నారు. పేకాట, కోడి పందేలు, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. గ్రామాలను సందర్శించి, నేర ప్రవర్తన గల వ్యక్తుల స్థితిగతులను తెలుసుకోవాలని, ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చైతన్యపరచాలని సూచించారు. అనంతరం వివిధ కేసుల్లో పురోగతి సాధించిన 56 మంది పోలీస్ సిబ్బందిని ప్రశంసా పత్రాలతో ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జి.ఎస్.ఎన్.వి.ప్రసాదరావు, కె.జగదీశ్వరరావు, డీఎస్పీలు బి.మోహనరావు, సీఐలు టి.వి.విజయకుమార్, పి.శ్రీనివాసరావు, ధనంజయరావు, లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, బాల సూర్యరావు, టి.లక్ష్మి, రమేష్, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

‘రైవాడ’ ఆధునికీకరణ తక్షణ అవసరం


రైవాడ జలాశయం స్పిల్వే గేట్లును పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

దేవరాపల్లి: స్పిల్వే గేట్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో రైవాడ జలాశయానికి ప్రమాదం పొంచి ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. ఈ మేరకు రైవాడ జలాశయ స్పిల్వే గేట్ల ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైవాడ ప్రాజెక్టు నిర్మించి సుమారు ఐదు దశాబ్దాలు కావస్తుందన్నారు. ప్రాజెక్టుకు పొంచి ఉన్న ముప్పును ఇరిగేషన్ అధికారులు గుర్తించి, ఆధునికీకరణ కోసం ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రపంచ బ్యాంక్ నిధులు రూ.336 కోట్లతో ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినా అతీగతీ లేదన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అత్యంత కీలకమైన ప్రాజెక్టు పట్ల పాలకులు నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. ఇప్పటికైనా పాలకులు తక్షణమే స్పందించి ప్రాజెక్టు ఆధునికీకరణకు నిధులు మంజూరు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని వెంకన్న డిమాండ్ చేశారు.

‘మధ్యాహ్న’ కార్మికులకు గౌరవ వేతనం చెల్లింపు

అనకాపల్లిటౌన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గౌరవ వేతనాన్ని ఈ ఏడాది మార్చి నెల వరకు చెల్లించినట్లు డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. హైస్కూళ్లలో భోజన పథకం వంట ఖర్చులు బడ్జెట్ అనుసరించి ఈ ఏడాది ఏప్రిల్ 25వ తేదీ వరకు చెల్లిస్తూ వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించి ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల భోజన పథకం వంట ఖర్చుల చెల్లింపునకు బడ్జెట్ విడుదల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పోలీస్ శాఖకు దివీస్ డ్రోన్లు


సీపీ బాగ్చికి డ్రోన్లు అందజేస్తున్న దివీస్ జీఎం కోటేశ్వరరావు

విశాఖ సిటీ: దివీస్ ల్యాబ్స్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా విశాఖ నగర పోలీస్ శాఖకు రెండు అత్యాధునిక డ్రోన్‌లను అందజేసింది. ఈ డ్రోన్‌లను సీపీ శంఖబ్రత బాగ్చికి అందజేశారు. ఈ డ్రోన్‌లలో హెచ్చరికలు, సూచనలు చేసే లౌడ్‌స్పీకర్, డే అండ్ నైట్ విజన్ కెమెరా, 5 కిలోమీటర్ల పరిధి, 45 నిమిషాలకు పైగా ఎగిరే సమయం, డిటెక్షన్, రికగ్నిషన్, ఐడెంటిఫికేషన్, లైవ్ స్ట్రీమింగ్ కనెక్టివిటీ, సెర్చ్‌లైట్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులతో పాటు దివీస్ జీఎం వై.ఎస్.కోటేశ్వరరావు, లైజన్ కన్సల్టెంట్ ఎం.ఎస్.వరహాలరెడ్డి, సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుడికి త్రిచక్ర వాహనం వితరణ


తూర్రి రవికి త్రిచక్ర వాహనం అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, కంపెనీ వైస్ ప్రెసిడెంట్ మురళీధర్

తుమ్మపాల: పరిశ్రమలు సేవా దృక్పథంతో సమాజ సేవకు ముందుకు రావాలని కలెక్టర్ విజయ కృష్ణన్ కోరారు. అచ్యుతాపురం సెజ్‌లోని టొయోట్సొ రేర్ ఎర్త్ జపాన్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన త్రిచక్ర హోండా యాక్టివ్ వాహనాన్ని కలెక్టరేట్ వద్ద శుక్రవారం తూర్రి రవి అనే దివ్యాంగుడికి కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆమె అందజేశారు. కలెక్టర్ వినతి మేరకు రావికమతం మండలం రోచుపణుకు గ్రామానికి చెందిన రవికి ఈ వాహనం అందించినట్లు కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మురళీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సుధాకర్, కంపెనీ క్వాలిటీ కంట్రోల్ హెడ్ ఆర్.రవికుమార్ పాల్గొన్నారు .

కోలుకుంటున్న గుర్తు తెలియని వ్యక్తి


కోలుకున్న గుర్తు తెలియని వ్యక్తి

కశింకోట: తాళ్లపాలెం శివారులోని లే-అవుట్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ప్రాథమిక చికిత్స అందించి శుక్రవారం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. ప్రస్తుతం స్పృహలోకి వచ్చి కోలుకుంటున్నాడని చెప్పారు. భాషా సమస్య వల్ల తన వివరాలు చెప్పలేకపోతున్నాడన్నారు. 35 ఏళ్ల వయస్సు ఉన్న ఆయన వివరాలు తెలిసిన వారు పోలీసు స్టేషన్‌లో గానీ, సీఐ అల్లు స్వామినాయుడు, 94407 96088 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ లీకై మహిళ మృతి

రోలుగుంట : బుచ్చంపేటకు చెందిన కిల్లాడ నర్సమ్మ(59) శుక్రవారం గ్యాస్ లీకైన ఘటనలో తీవ్రంగా గాయపడింది. ఆమెను బంధువులు మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. తీవ్రంగా కాలిన గాయాలతో ఉన్న ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారు వేర్వేరు చోట్ల ఉంటున్నారు. ఆస్పత్రి సిబ్బంది సమాచారంతో ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు సర్వం సిద్ధం


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

విశాఖ విద్య: ఈ నెల 25న జరగనున్న సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. నగరంలోని 19 పరీక్షా కేంద్రాల్లో 8,424 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల్లో జామర్లు, తాగునీరు, టాయిలెట్లు వంటి కనీస వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. యూపీఎస్సీ పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని, ఏమైనా సమస్యలుంటే తెలియజేయడానికి కంట్రోల్ రూమ్ (నం. 0891-2590100, 0891-2590102) ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 వరకు రెండు సెషన్లలో జరుగుతుంది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, యూపీఎస్సీ డైరెక్టర్ పట్నాయక్ సమావేశంలో పాల్గొన్నారు.

26 నుంచి సత్యసాయి ప్రేమ రథయాత్ర


మాట్లాడుతున్న సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు

దేవరాపల్లి: అనకాపల్లిలో జిల్లాలో ఈ నెల 26 నుంచి సత్యసాయి ప్రేమ రథయాత్ర నిర్వహించనున్నట్టు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు దేవరాపల్లిలోని సత్యసాయి మందిరంలో శుక్రవారం మాడుగుల నియోజకవర్గ స్థాయి సత్యసాయి భక్తుల ముఖ్య సమావేశం జరిగింది. సత్యసాయి రథయాత్రను ఏయే మార్గాల గుండా నిర్వహించాలనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ రథయాత్ర దేశ వ్యాప్తంగా ఏప్రిల్ 24న ప్రారంభమైందన్నారు. నాలుగు ప్రేమ రథాలు దేశమంతా తిరుగుతున్నాయన్నారు. ప్రతి మండలంలోని ప్రధాన మార్గాల మీదుగా ఈ యాత్ర సాగుతుందన్నారు. స్వామి రథం ఊరేగింపు నిర్వహించే మార్గంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో అపూర్వ స్వాగతం పలకాలన్నారు. ఈ సమావేశంలో సత్య సాయి సేవా సంస్థల జోన్ ఇన్‌చార్జి సిహెచ్.వి.రవిశంకర్, సేవాదళ్ ఇన్‌చార్జి కన్నూరు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

29న విశాఖ కేంద్రంగా పీఆర్ ప్రాంతీయ సదస్సు

మహారాణిపేట: ఈ నెల 29న విశాఖలో పంచాయతీ రాజ్‌పై ఆరు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, గోవా, నాగాలాండ్, లడఖ్, మేఘాలయ) ప్రాంతీయ సమావేశం జరగనుంది. 2025-26 సంవత్సరానికి సంబంధించిన పంచాయతీరాజ్ పథకాలపై అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు, ఈ రాష్ట్రాల పంచాయతీరాజ్ కమిషనర్లు, ప్రభుత్వ కార్యదర్శులు, ఇతర సీనియర్ అధికారులు హాజరు కానున్నారు.

మిస్సింగ్ మిస్టరీ

ఫేస్‌బుక్‌లో పరిచయమైన వ్యక్తి తియ్యని మాటలకు ప్రే‘మాయ’లో పడిపోయి ఒకరు.. వివాహేతర సంబంధంతో పిల్లలను తీసుకొని మరొకరు.. తల్లిదండ్రులు మందలించారని ఇంకొకరు.. ఇలా విశాఖలో వరుసగా మహిళల అదృశ్య సంఘటనలు కలవరం రేపుతున్నాయి. దాదాపుగా ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట మహిళలు మాయమవుతూనే ఉన్నారు. బాలికల నుంచి వివాహితుల వరకు వయోభేదాలు లేకుండా కనిపించకుండా పోతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారు.. తిరిగి ఇంటికి చేరకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వీరి కోసం కుటుంబసభ్యులు.. సమీప బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో మిస్సింగ్ కేసుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. గత ఐదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా కేవలం నాలుగు నెలల్లోనే 175 మంది మహిళలు అదృశ్యమైనట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.

- విశాఖలో పెరుగుతున్న మహిళల అదృశ్యం కేసులు
- 4 నెలల్లో 175 మంది మాయం
- ఇప్పటి వరకు 133 మంది ఆచూకీ లభ్యం
- మిస్టరీగానే 42 మంది మహిళల అదృశ్యం
- ప్రేమ, వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలే కారణం







విశాఖ సిటీ: విశాఖ నగరంలో మహిళల అదృశ్యాలకు ప్రధానంగా ప్రేమ వ్యవహారాలు, వివాహేతర సంబంధాలే కారణమని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కనిపించకుండా పోయిన యువతుల్లో ఎక్కువ మంది ప్రేమించుకోవడం, ప్రేమికుడిని దక్కించుకోవడం కోసమే ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది.


అలాగే మధ్య వయస్కులైన మహిళలు కూడా వివాహేతర సంబంధాల కారణంగా కుటుంబాన్ని వదిలి వెళ్తున్నారు. మిస్సింగ్ కేసుల్లో సుమారు 75 శాతం వరకు ఈ రెండు కారణాలే ఉన్నాయని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఇది నగరంలో పెరుగుతున్న ఆందోళనకరమైన ధోరణిగా మారింది.

175 మంది మాయం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మిస్సింగ్ కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయి. గత ఐదేళ్లలో ప్రతి ఏటా 50 నుంచి 186 కేసులు వరకు రాగా.. ఈ ఏడాది నాలుగు నెలల్లోనే 175 కేసులు నమోదవడం విశాఖ పరిస్థితికి అద్దం పడుతోంది. జనవరిలో 37, ఫిబ్రవరిలో 49, మార్చిలో 43, ఏప్రిల్‌లో 46 మంది అదృశ్యమయ్యారు. వీరిలో 133 మంది ఆచూకీని పోలీసులు గుర్తించారు. వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇంకా 42 మంది ఆచూకీ తెలియరాలేదు. దీంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. వీరు ప్రేమ, ఇతర కారణాలతో కావాలనే వెళ్లిపోయారా? లేదా ఏదైనా దురదృష్ట సంఘటన జరిగిందా? అన్నది తెలియాల్సి ఉంది. మిస్సింగ్ కేసుల పరిష్కారం కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

పోలీసులకు సవాల్

వీరిని పట్టుకోవడం పోలీసులకు సైతం సవాలుగా మారుతోంది. కొంతమంది ఆచూకీ తెలుసుకున్నప్పటికీ.. మేజర్లు, చట్టాలు, హక్కులు పేరుతో పోలీసులకు కూడా చుక్కలు చూపించిన సంఘటనలు ఉన్నాయి. ఇటువంటి కేసుల్లో అదృశ్యమైన వారి ఆచూకీని పోలీసులు గుర్తించడం మినహా వారిని కుటుంబ సభ్యులకు అప్పగించడం కూడా ఒక పెద్ద సమస్యగా మారుతోంది.





క్లుప్తంగా

చంద్రబాబు పాలనలో అధ్వానంగా రోడ్లు


మాట్లాడుతున్న వియ్యపు రాజు

అనకాపల్లి: అధికారం చేపట్టిన వెంటనే రహదారులను అభివృద్ధి చేస్తామని సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఏడాదవుతున్నా సీఎం చంద్రబాబునాయుడు అమలు చేయలేదని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వియ్యపు రాజు విమర్శించారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అనకాపల్లి -చోడవరం- మాడుగుల రహదారి, నర్సీపట్నం, రావికమతం, అచ్యుతాపురం రోడ్లు దుస్థితి దారుణంగా ఉందని వాపోయారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారుల్లో వర్షపు నీరు చేరి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మరమ్మతులు చేయించలేని పరిస్థితిల్లో ప్రభుత్వ పాలన ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు కొరిబిల్లి శంకరరావు, నరాల శెట్టి సత్యనారాయణ, విత్తనాలు పోతురాజు, ఎం సూరిబాబు, పాత్రపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా మంచినీటి తొట్టె


తుమ్మపాలలో నిర్మించి వదిలేసిన నీటి కుండీ

అనకాపల్లి టౌన్: మండలంలోని తుమ్మపాల పశువుల సంత సమీపంలో వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం నీటి కుండీలను నిర్మించి వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేసింది. ఉపాధి హామీ పథకంలో భాగంగా దీన్ని రూ.30 వేలు ఖర్చుపెట్టి నిర్మించారు. వేసవిలో అప్పుడే రెండు నెలలు పూర్తి కావస్తుంది. ఇంతవరకు దీన్ని వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ భూముల శిస్తుకు వేలం

గొలుగొండ: లింగంపేట నూకాలమ్మతల్లి ఆలయ భూములు శిస్తులకు శుక్రవారం వేలం నిర్వహించారు. ఆలయ నిర్వహణ అధికారి దివ్యతేజ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా చుట్టుపక్కల రైతులు హాజరయ్యారు. ప్రస్తుతం 12 ఎకరాల భూములు శిస్తులకు వేలం నిర్వహించగా లింగంపేట గ్రామానికి చెందిన గోలకొండ చినసత్తిబాబు ఐదు ఎకరాలను రూ.24వేలకు దక్కించుకున్నారు. గతేడాది ఈ ఐదెకరాలు రూ. 29 వేలకు శిస్తుకు వెళ్లిందని, ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేసి, నిర్ణయం తీసుకుంటామని ఈవో తెలిపారు. మరో 7 ఎకరాలకు సంబంధించి వేలం పాటలో రైతులు ఎవరూ ఆసక్తి చూపలేదని చెప్పారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 160 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,650	4,770
రెండో రకం	3,690	4,430
మూడోరకం	3,440	3,440

అనకాపల్లి సినిమాలు

నిశ్శబ్ద ప్రేమ : రాజా
శుభం : సత్యనారాయణస్క్రీన్-1
లవ్‌లీ : సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
సత్యనారాయణ స్క్రీన్-2 : శుభం, (ఉదయం, మధ్యాహ్నం)
హిట్-3 : పర్తిసాయి
సింగల్ : షిర్డీసాయి
ఏస్‌ఈ : వెంకటేశ్వర
వర్షం : శ్రీసత్య
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్ : రామచంద్ర

గ్యాస్ సమాచారం

అనకాపల్లి:ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-12, ఓ పాజిటివ్-12, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

వ్యాధుల గాలం

- వర్షాలతో పశువులకు వ్యాధులు సోకే అవకాశం
- నిర్లక్ష్యం వహిస్తే పశు ప్రాణానికే అపాయం
- నివారణకు నట్టల మందులు
- అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబరు 1962

తుమ్మపాల: వర్షాకాలం వచ్చిందంటే చాలు పశువులపై వ్యాధులు ముప్పేట దాడి చేస్తాయి. అందులోను ఈ ఏడాది తొలకరి వర్షాలు ముందుగానే పడుతున్నాయి. ఈ కాలంలో పశువుల సంరక్షణ చర్యలు ఎంతో అవసరం.. అందుకే పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. ఏదైనా వ్యాధి సోకినట్లు ఏమాత్రం అనుమానం వచ్చినా సమీపంలోని పశు వైద్యశాలను సంప్రదించాలని చెబుతున్నారు. ఒకవేళ జీవం పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నా, ఆస్పత్రికి తరలించలేని పరిస్థితిలో ఉన్నా, 1962కు ఫోన్ చేయాలంటున్నారు. పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటే మెరుగైన చికిత్స కోసం దగ్గరలోని పశు వైద్యశాలకు తరలించాలని వైద్యులు సూచిస్తున్నారు.

◆ నట్టలతో ఎదుగుదలకు బ్రేక్

గొర్రెలు పచ్చిమేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. దీంతో గొర్రె ఎదగడానికి అవకాశం ఉండదు. గొర్రెలు తిన్న ఆహారమంతా నులి పురుగులే తినేయడంతో రోగాల బారిన పడే అవకాశం ఉంది. వర్షాకాలంలో ఎక్కువగా గొర్రెలు నట్టల వ్యాధి బారిన పడతాయి. ఎందుకంటే వర్షాలు పడి అక్కడక్కడ పచ్చిమేత పెరుగుతూ ఉంటుంది. అది తిన్నప్పుడు సమస్య ఉత్పన్నమవుతుంది. అందుకే ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా ఆరు నెలలకోసారి నట్టల నివారణ మందులు ఉచితంగా వేస్తుంది. ప్రస్తుతం పశు వైద్య సిబ్బంది నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నారు.

◆ గొంతువాపు.. ప్రాణాంతకం

పశువులకు సంక్రమించే వ్యాదుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైంది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం. నోటి నుంచి చొంగ, శ్వాస పీల్చడానికి ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతువాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు ముఖ్యంగా జూన్, జులై నెలల్లో (హెచ్ఎస్) టీకాలు వేయించుకోవాలి. వ్యాధి బారిన పడిన పశువును మిగిలిన వాటి నుంచి దూరం చేయాలి.

◆ వ్యాక్సిన్‌తో 'చిటుకు'కు చెక్

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా సోకే మరో వ్యాధి చిటుకు. ఈ వ్యాధి వచ్చినప్పుడు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీని నివారణ కోసం జూన్, జులై మాసాల్లో ఇటాస్ వ్యాక్సిన్ వేస్తారు.

నియోజకవర్గంలో పశువులు, జీవాల వివరాలు

మండలంలో	గోవులు,	గేదెలు,	గొర్రెలు,	మేకలు,	పందులు,	మొత్తం
అనకాపల్లి	7,010	12,139	3,999	6,620	0	29,768
కశింకోట	7,096	10,348	7,410	8,620	379	33,853
మొత్తం	14,106	22,487	11,409	15,240	379	63,621


ఆవు, గేదెలకు వ్యాధి నిరోధక టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది

రైతులు పశువులకు సంబంధించిన వ్యాధులను సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందించాలి. వాటిని వ్యాధుల నుంచి సంరక్షించుకోవచ్చు.

◆ 'గాలికుంటు'తో నీరసం

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెలు వంటి వాటికి సోకుతుంది. ఈ వ్యాధి బారిన పడిన పశువులకు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీల మధ్య ఉంటుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగ్గా తీసుకోలేవు. నీరసించి, నడిచేందుకూ ఇబ్బంది పడతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచన మేరకు యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

◆ పీడించే 'జలగ'

మురుగునీరు, కాలువల్లో అపరిశుభ్రమైన నీరు తాగడం వల్ల జలగ వ్యాధి ప్రబలుతుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు వస్తుంది. పశువులు మేత మేయడంలో ఇబ్బంది పడతాయి. పాల దిగుబడి తగ్గుతుంది. జలగ వ్యాధి బారిన పడకుండా పశువులకు డిస్టోడిన్ 4 మాత్రలు, 10 మిల్లీలీటర్ల నియోజడ ప్లస్‌ను అందించాలి.

గొర్రెలు, మేకలకు టీకాలు వేస్తున్నాం



పశువులు, గొర్రెలు, మేకల్లో అనారోగ్యాన్ని గుర్తిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ. వ్యాధి నివారణ టీకాలు వేయిస్తే వాటి ప్రభావం ఆర్నెల్ల వరకూ ఉంటుంది. నట్టల నివారణ మందులను ఆర్నెల్లకోసారి వేస్తాం. గొంతువాపు, చిటుకు వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. జబ్బు వ్యాపికి, గొంతు వాపునకు టీకాలు ప్రక్రియ కొనసాగుతుంది. అత్యవసర పరిస్థితుల్లో 1962కు కాల్ చేస్తే సిబ్బంది వచ్చి వైద్య సేవలు అందిస్తారు. ఎలాంటి సందేహాలున్నా రైతులు పశువైద్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించవచ్చు.

– డాక్టర్ అనిల్, పశుసంవర్ధక శాఖ అధికారి, అనకాపల్లి మండలం

ఎండీయూ ఆపరేటర్ల జీవితాలతో చెలగాటం

అనకాపల్లి: ప్రజా పంపిణీ వ్యవస్థలో దేశం మెచ్చిన రేషన్ డోర్ డెలివరీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మంగళం పాడటం దారుణమని వైఎస్సార్‌సీపీ 83వ వార్డు ఇన్‌చార్జ్ జాజుల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎండీయూ వాహనాల వ్యవస్థను రద్దు చేసి 20 వేల కుటుంబాలను రోడ్డున పడేసిందని ధ్వజమెత్తారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో వస్తున్న మంచి పేరు చూసి ఓర్వలేకనే ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. సీఎం చంద్రబాబు ఏడాది పాలనలో సూపర్ సిక్స్ అమలు చేయలేక వైఎస్సార్‌సీపీ హయాంలో పేదలకు అందించిన పథకాలను నిర్వీర్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎండీయూ ఆపరేటర్లు కరోనా వంటి విపత్తుల సమయంలో సేవలు అందించారని, అర్ధాంతరంగా వాహనాలు నిలిపివేస్తే ఆపరేటర్ల కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోయారు. 2027 వరకు అగ్రిమెంట్ ప్రకారం వారి సేవలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబునాయుడు నిరుద్యోగులకు నిరాశ కలిగించారన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఎనిమిది మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.80 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

దేశ హితమే 'తితిక్ష' నాటిక


చీకటి పువ్వు నాటికలో సన్నివేశం


నాటిక పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ జ్యోతి

కశింకోట: సమాజ నాశనానికి కారణభూతమవుతున్న గంజాయి వ్యాపారాన్ని మానడానికి ససేమిరా అన్న కుమారున్ని దేశ హితం కోసం కన్నతల్లి హతమార్చిన కథాంశంతో ప్రదర్శించిన 'తితిక్ష' (సహనం) నాటిక ఆహూతులను విశేషంగా అలరించింది. ఇక్కడి అశోక ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళాపరిషత్ నాల్గో దఫా నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా గురువారం రాత్రి స్థానిక గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వేదికపై రెండో నాటికగా ప్రదర్శించారు. రాత్రి ఒంటి గంట ప్రాంతం వరకు నాటిక ప్రదర్శన సాగింది. కాకినాడకు చెందిన ఉమా ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన నాటిక ఇలా సాగింది. దేశం కోసం తన ప్రాణాలను శ్రీకృష్ణ త్యాగం చేశారు. భార్య భారతి తన కుమారుని అల్లారు ముద్దుగా పెంచుతోంది. అతడు రహస్యంగా సాగిస్తున్న గంజాయి వ్యాపారం మానివేయాలని చెప్పగా, దానికి ససేమిరా అనడంతో హత్య చేసి జైలుకు వెళ్తుంది. అయితే భారతి అన్నయ్య రాధాకృష్ణ మాత్రం తన చెల్లెలు నిర్దోషి అని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాడు. కోర్టులో వాదోప వాదనల్లో భారతి తాను చంపింది గంజాయి రాక్షసుడ్ని అని, చంపకపోతే ఎన్నో జీవితాలు నాశనమవుతాయని అంటుంది. న్యాయస్థానం తీర్పు ఇవ్వబోతుండగా, గంజాయి భూతం వచ్చి ఆమెను చిత్రహింసలు పెడుతుంది. న్యాయ దేవత కళ్ల గంతలు విప్పి చేతిలో ధర్మ కాటాను భారతి చేతిలో పెడుతుంది. రాజ్యాంగ పుస్తకాన్ని మరో చేతిలో పెట్టి గంజాయి రాక్షసుడ్ని సంహరిస్తుంది. భారతిగా ఎస్. జ్యోతిరాణి, హరిచంద్రగా బి. గణేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా డి. ఉమాశంకర్, రాధాకృష్ణగా రాధాకృష్ణ, జడ్జిగా కె. పుల్లారావు, ఎస్ఐగా నాచూడి అప్పారావు, అమీన్‌గా శ్రీనివాసరావు, వివేక్‌గా డీఎస్ఎస్ కుమార్, అభిరాంగా డి. వినయ్, విలేకరిగా రఘుబాబు, గంజాయి భూతంగా శ్రీనివాస్, న్యాయ దేవతగా ముళ్లపూడి ఈశ్వరి, లాయర్‌గా ముళ్లపూడి విజయలక్ష్మి పాత్రోచితంగా నటించి ఆహూతులను మెప్పించారు. డి. ఉమాశంకర్ రచనకు కుమారుడు వినయ్ దర్శకత్వం వహించారు. రమణ సంగీతాన్ని సమకూర్చారు.

క్షమించడంలోనే నిజమైన ప్రేమ..

రాత్రి పది గంటల ప్రాంతంలో నిర్వహించిన 'చీకటి పువ్వు' నాటిక ఆహూతులను అలరించింది. కరీంనగర్‌కు చెందిన చైతన్య కళా భారతి బృందం ఈ ప్రదర్శన జరిపింది. జీవితంలో తప్పులు చేయడం సహజం. వాటిని తెలుసుకొని పశ్చాత్తాప పడిన తర్వాత వారిని దూరం పెట్టకుండా పెద్ద మనస్సుతో క్షమించి దగ్గరకి చేర్చుకోవాలి. ప్రాణం పోయిన తర్వాత బాధపడే కంటే ఉన్నప్పుడే బతికి ఉండగా, బాధ్యతగా వ్యవహరించి చేరదీయాలని,


తితిక్ష నాటికలో కోర్టు సన్నివేశం


హాజరైన ఆహూతులు

క్షమించడంలోనే నిజమైన ప్రేమ ఉందని తెలియజెప్పే ఇతి వృత్తంతో నాటికను ప్రదర్శించారు. పవిత్రగా గుడివాడ లహరి, వంశీగా కొత్తకొండ సత్యనారాయణ, హరిగా మంచాల రమేష్, సిదార్థగా సూర్య, మోహన్ ప్రసాద్‌గా ఏపూరి శ్రీనివాస్, పీఎస్ నారాయణ మూలకథకు పరమాత్ముని శివరాం నాటకీకరణ చేశారు. మంచాల రమేష్ దర్శకత్వం వహించగా సురభి నాగరాజు సంగీతాన్ని అందించారు. రెండో రోజు జరిగిన ఈ నాటిక పోటీలను వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని కలిసి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. వారితోపాటు పోటీలకు సహకారం అందించిన ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, వ్యాపారవేత్త పువ్వుల శ్రీనివాసరావు, వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యుడు ఆళ్ల లింగాజీలను నిర్వాహకులు, అశోక ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి దేవినాయుడు, ఉపాధ్యక్షుడు ఆళ్ల మహాలక్ష్మినాయుడు తదితరులు దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు.

యోగాంధ్ర విజయవంతం చేయాలి


యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన కలిగిస్తున్న ఎంపీడీవో రవికుమార్


హాజరైన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది

కశింకోట: మండలంలో యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి సుభాషిణి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే నెల 21 వరకు జరిగే యోగాంధ్రలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.వి. రవికుమార్, తహసీల్దార్ జి. సత్యనారాయణ మాట్లాడారు. ఎంఈవో కెఎస్ఎన్ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తుది దశలో నూకాంబిక ఆలయ పునర్నిర్మాణం


నూతన ఆలయ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయ పునర్నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని, త్వరలో ప్రారంభించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక నూకాంబిక ఆలయంలో దేవదాయ శాఖ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయంలో వేస్తున్న గ్రానైట్ ఫినిషింగ్ టైల్స్‌ను వాడకూడదని, దీనిని మార్చి రఫ్ గ్రానైట్, న్యాచురల్ స్టోన్ ఫ్లోరింగ్ వేయాలని సూచించారు. ఆలయ ప్రాంతమంతా సుందరంగా తీర్చిదిద్దాలన్నారు దేవాలయంలో ఏసీలు, విద్యుత్ దీపాలు విరివిగా ఏర్పాటు చేయాలని కోరారు. దేవాలయ ప్రాంగణంలో ఇకపై చేయు అభివృద్ధి పనులు మాస్టర్ ప్లాన్ ప్రకారం, నాణ్యతా ప్రమాణాలతో చేయాలన్నారు. ఆలయానికి కావలసిన భూములు కొనుగోలు చేయడానికి సంబంధిత యజమానులతో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వి.రాంబాబు, దేవదాయ శాఖ డీఈఈ కృష్ణ, ఉప సపతి శ్రీనివాసచార్యులు, ఏఈ శివప్రసాద్, జిల్లా సహాయ కమిషనర్ సుధారాణి, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

చెత్త తొలగింపుపై నిర్లక్ష్యం వద్దు


చెత్త సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టు తొట్టెలను పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

మాకవరపాలెం: గ్రామాల్లో చెత్త తొలగింపుపై నిర్లక్ష్యం చేయొద్దని డీపీవో శిరీషారాణి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని గిడుతూరు, బయ్యవరం, నారాయణరాజుపేట గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇక్కడి చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. వర్మీకంపోస్టు ఎరువు తయారీపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తాగునీటి క్లోరినేషన్‌తో పాటు వీధులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా పంచాయతీ అధికారులు పంపిణీ చేసిన బుట్టల్లోనే వేస్తూ పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చెత్త సంపద కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి నాగలక్ష్మి, డీఎల్‌పీవో మూర్తి, డిప్యూటీ ఎంపీడీవో సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

సంయమనం పాటించాలని విజ్ఞప్తి


మాట్లాడుతున్న గణపర్తి సర్పంచ్ నాయుడు

మునగపాక: గణపర్తి గ్రామంలో వివాదాలకు తావులేకుండా అన్ని వర్గాల వారు సంయమనం పాటించాలని సర్పంచ్ చదరం నాయుడు కోరారు. గురువారం రాత్రి గ్రామ రామాలయంలో రాజకీయాలకు అతీతంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో పాకలు, షెడ్‌లు అక్రమంగా నిర్మించారని రెవెన్యూ సిబ్బందికి అందిన ఫిర్యాదు మేరకు వాటిని తొలగించారన్నారు. దళితవాడను ఆనుకొని రోలుగెడ్డ గట్టుపై తాత్కాలికంగా వేసుకున్న పశువుల పాకలపై అధికారులు చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. గ్రామంలో మున్ముందు ఆక్రమణలకు సంబంధించి ఎటువంటి వివాదాలకు తావు లేకుండా తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు సమక్షంలో రాజకీయాలకు అతీతంగా పరిష్కరించుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఇందుకు సమావేశానికి హాజరైన వారంతా సమ్మతం తెలిపినట్లు ఆయన చెప్పారు. సమావేశంలో కర్రి రామనాగేశ్వరరావు, కాళ్ల చంద్రమోహన్, చదరం అప్పలనాయుడు, పిట్టా అప్పారావు, కాండ్రేగుల సీతారామ్, గొంది రవి తదితరులు పాల్గొన్నారు.

మునగపాక ఎస్ఐకు పురస్కారం



ఎస్పీ తుహిన్ సిన్హా నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న ఎస్ఐ పి.ప్రసాదరావు ఉత్తమ అధికారిగా ఎస్పీ తుహిన్ సిన్హా నుంచి పురస్కారం అందుకున్నారు. అనకాపల్లిలో శుక్రవారం నిర్వహించిన క్రైమ్ మీటింగ్‌లో ప్రసాదరావు సేవలను గుర్తించిన సిన్హా అభినందించడంతోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. పోలీసు సేవలను మరింత విస్తృతం చేయాలని, అర్జీదారులకు సకాలంలో సేవలందించాలని ఎస్పీ సూచించినట్లు ఎస్ఐ తెలిపారు.

తాండవలో స్వల్పంగా పెరిగిన నీటిమట్టం


తాండవ ప్రాజెక్టులో స్వల్పంగా పెరిగిన నీటి మట్టం

నాతవరం: ఇటీవల కురిసిన వర్షాలకు తాండవ రిజర్వాయరులో స్వల్పంగా నీటి మట్టం పెరిగింది. జిల్లాలోనే ఏకైక మేజరు ప్రాజెక్టుగా తాండవ రిజర్వాయరు ప్రత్యేకత సంతరించుకుంది. దీని నీటి ఆధారంగా రెండు జిల్లాల్లో నాలుగు నియోజకవర్గాల పరిధిలో సుమారుగా 52 వేల ఎకరాలు ఆయకట్టులో ఖరీఫ్ సీజన్‌కు వరి పంట సాగవుతుంది. తాండవ రిజర్వాయరు ప్రమాద స్థాయి నీటి మట్టం 380 అడుగులు. ప్రస్తుతం తాండవ రిజర్వాయరులో నీటి మట్టం 365 అడుగులకు చేరిందని ప్రాజెక్టు జేఈ ప్రేమకుమార్ తెలిపారు. వర్షాలకు ముందు తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం 364.5 అడుగులు ఉండేదన్నారు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో రోజుకు 250 క్యూసెక్కులు నీరు ప్రాజెక్టులోకి వచ్చిందన్నారు. ఇప్పుడు వర్షాలు తగ్గడంతో శుక్రవారం ఉదయం నుంచి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కేవలం 42 క్యూసెక్కులు మాత్రమే ఉందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు సాగునీరు ఇబ్బంది ఉండదని జేఈ తెలిపారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాత గోవిందరావుకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని వడపాలెం గ్రామానికి చెందిన పి.గోవిందరావు రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం అందించారు. కుటుంబ సమేతంగా సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటరులో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్ అందించారు.

పాక్షికంగా ఇల్లు కూల్చివేత దారుణం


కిల్లాడ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు

కోటవురట్ల: జగనన్న కాలనీలో ఎన్నో వ్యయప్రయాసలతో నిర్మించుకున్న ఇంటిని కూటమి ప్రభుత్వం కూలగొట్టడం దారుణమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే ఆశయంతో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేశారన్నారు. దాంతో రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని లక్షల మంది ఇళ్లు నిర్మించుకుని సొంతింటి కలను నెరవేర్చుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి లే అవుట్‌లో చివరన ఉన్న ఫ్లాట్లలో అదనంగా ఉన్న కొద్దిపాటి స్థలాన్ని కలుపుకుని ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. దీని వల్ల ప్రభుత్వ ఆస్తులకు ఎటువంటి నష్టం కలగలేదన్నారు. అయితే రాజకీయ కక్షతో ఎంతో కష్టపడి కట్టుకున్న ఇళ్లను కూలగొట్టే ఘనతను కూటమి ప్రభుత్వం దక్కించుకుందని విమర్శించారు. గొట్టివాడ జగనన్న కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకుడు కట్టుమూరి అప్పారావు నిర్మించుకున్న ఇంటిని పాక్షికంగా కూలగొట్టడం దారుణమన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే ఆ ఇంటిని కూలగొట్టారన్నారు. ఇకనైనా ఇటువంటి రాజకీయ కక్షలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెందుర్తి: పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద ట్రాక్ దాటుతూ గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ అధికారి అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెందుర్తి రైల్వే స్టేషన్‌కు సమీపంలో ట్రాక్‌పై తీవ్ర గాయాలతో ఉన్న ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి వచ్చి పరిశీలించారు. మృతుని వయసు 45–50 ఏళ్లు ఉండవచ్చని మారూఫ్ తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్‌లో భద్రపరిచామని.. వివరాలకు 94948 87786 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాల్సిందిగా సూచించారు.